



# ఏనీ గుడ్ న్యూస్ సర్?

వేదుల వేంకట రమణమూర్తి

"గుడ్ మార్నింగ్ సర్!" అంటూ పలకరించాడు రాఘవరావు.

అంతవరకూ పేపరు చదువుతున్న నేను అతని పిలుపుకు తలెత్తి చూసి - "గుడ్ మాణింగ్" అంటూ విష్ చేసి "కూర్చోండి" అన్నాను నా ఎదురుగా ఉన్న కుర్చీ చూపిస్తూ.

"ఎనీ గుడ్ న్యూస్ సర్?" అడిగాడు తన అలవాటు ప్రకారంగా.

"నో గుడ్ న్యూస్. అయినా ఏ ముంటాయి చెప్పండి. పేపరు తీస్తే చాలు శ్రీలంకలో కాల్పులు, పంజాబులో టెర్రరిజం, ట్రైన్ ఏక్సిడెంట్స్, అనావృష్టి - ఇలా రోజుకి ఎన్నో చావు వార్తలు,

విషాద వార్తలు వినాల్సి వస్తున్న ఈ రోజుల్లో గుడ్ న్యూస్ ఎక్కడ చెప్పండి?''

''అవన్నీ వదిలేయండి సర్. పేపర్లో వార్తలు, రేడియోలో వార్తలు విని విని వినుగెత్తిపోతున్నాం. మీ పర్సనల్‌గా ఏమైనా ఉంటే చెప్పండి'' అన్నాడు రాఘవరావు.

''నాకు సంబంధించి శుభవార్త అంటూ ఏమీ లేదు. ఈ రోజుల్లో నార్మల్‌గా బతకగలుగుతున్నామనేదే శుభవార్త. ఏమంటారు?'' అన్నా న్నేను.

అంతే. తన పని అయిపోయిం దనుకుంటూ కుర్చీలోంచి లేచి పక్క రూంలో ఉన్న తన సీటుకి వెళ్ళిపోయాడు రాఘవరావు. నాకు తెలుసు. అతనికి ఏ విషయం గురించి చెప్పినా అక్కరలేదని.

ఏమిటో వింత మనిషి. ప్రతిరోజూ ఒకటే ప్రశ్న. 'ఎనీ గుడ్ న్యూస్' - అంటూ. ఆఫీసుకి వస్తూనే నన్ను అతను వేసే మొదటి ప్రశ్న.

నే నీ ఆఫీసులో చేరి మూడేళ్ళు కావస్తోంది. నే నిక్కడ ఆఫీసరునైనా, హెడ్ క్లర్కుగా పని చేస్తున్న రాఘవరావు దగ్గర అధికారిలా ప్రవర్తించను. కారణం అతను నాకు పెద్దన్నయ్యలాగో లేక తండ్రి లాగానో కనిపిస్తాడు.

ఆఫీసుల్లో మామూలుగా ఉండే రాజకీయాలతో తనకు ప్రమేయం లేదు. మితభాషి. ఎవరి మీదా చాడీలు చెప్పడు. తాను వినడు. తన పనేదో తనది.

నేను ఏదైనా నాకు గాని లేదా ఎవరికైనా సంబంధించినది గాని శుభవార్త చెబితే ఎంతగానో సంతోషిస్తాడు. నా భవిష్యత్తుకు సంబంధించిన విషయాలు చెబుతూ అన్ని విధాలా ప్రోత్సహిస్తాడు.

అత నో జ్ఞానపీఠం. ఎంకి దగ్గర నుంచి ఎలిజబెత్ రాణి వరకు, వంకాయ కూర నుంచి వజ్రాల వరకు ఏ విషయం గురించి అడిగినా అప్పటి కప్పుడు వివరంగా చెప్పగలిగే జ్ఞాన ముంది.

అందుకే అతనంటే నాకు గౌరవ భావ ముంది.

** ** **

ఆ రోజు నేను ఆఫీసుకి కొంచెం లేటుగా చేరేసరికి స్టాఫులో చాలామంది ఆఫీసు బయటనే గుంపుగా చేరి మాట్లాడుకోవటం కనిపించింది.

కాస్తంత ఆత్రత, ఆందోళనతో వారిని సమీపించి విషయ మేమిటని అడిగాను.

''మన చౌకీదారు రామయ్య నిన్న ఏక్సిడెంట్‌లో చనిపోయాడు సార్'' అని చెప్పాడు అందులో ఒకడు.

వారి మాటలని నమ్మలేకపోయాను. కొద్ది క్షణాల వరకూ ఆశ్చర్యంతోనూ, బాధతోనూ ఉండిపోయాను. నిన్నటి వరకూ మా మధ్య తిరుగుతూ మాతో పని చేసిన వ్యక్తి ఈ రోజు లేడన్న వార్త న న్నెంతగానో బాధపెట్టింది.

మిగిలిన వివరాలు విని నా గదిలోకి వెళ్ళబోతూ పక్కరూంలో ఒక్కడూ కూర్చొని ఏదో రాసుకుంటున్న రాఘవరావు కనిపించేసరికి అతని దగ్గరకు వెళ్ళాను ఈ విషయం గురించి ప్రస్తావిద్దా మనుకుని.

నన్ను చూసి వెంటనే నిలబడి ''గుడ్ మార్నింగ్ సర్'' అని ఆ వెనువెంటనే అతని అలవాటుగా అడిగే ప్రశ్న- ''ఎనీ గుడ్ న్యూస్ సర్?'' అంటూ అడిగాడు.

నాకు మతి పోయింది. అసలు ఈయనకి రామయ్య మరణవార్త తెలియదా? అనుకుంటూ ''రామయ్య ఏక్సిడెంట్‌లో పోయాడు మీకు తెలుసా?'' అన్నాను.

''అలాగా ! నాకు తెలియదు'' ఆ ఒక్క మాట చాలా యథాలాపంగా అనేసి, మరో విషయం గురించి వెంటనే మాట్లాడటం ప్రారంభించాడు.

నాకు చాలా ఆశ్చర్య మనిపించింది. ఒక వ్యక్తి మరణవార్త విని, అందునా అతడు మాతో కలిసి పని చేసే వ్యక్తి అయి ఉండి కూడా ఈయన అంత తేలికగా తీసుకోవడం నేను భరించలేకపోయాను.

వెంటనే అతని మాటలు ఇక వినలేక నా ఛాంబరులోకి వచ్చేశాను. అయినా నా ఆలోచనలు ఆగలేదు. తన తోటి వ్యక్తి మరణం పట్ల కించిత్ విచారం కూడా వ్యక్తం చేయలేని తనూ ఓ మనిషేనా? ఎంతసేపూ శుభవార్తల కోసమే ఎదురుచూసి, ఆ వార్తలు విని ఆనందించడమే గాని, ఇలాటి విషాద వార్తల పట్ల కొంచెమైనా విచారం వ్యక్తం చేయలేని తనలో మానవత్వం లేదా?

అంతవరకూ తనపై నా కున్న గౌరవ భావం క్షీణించడం మొదలైంది. అత నో స్వార్థపరుడిగా నా హృదయంలో కొత్త స్థానం ఏర్పరుచుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. అతనితో ముందులా చనువుగా, హృదయపూర్వకంగా మాట్లాడలేకపోతున్నాను. అతను మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా మామూలుగా మాట్లాడుతూనే ఉన్నాడు.

ఓ రోజు అతను ఆఫీసుకి రాలేదు. ఎందుకో అనుకున్నాను. సెలవుకి అప్లికేషన్ కూడా ముందుగా పెట్టకుండా సెలవు పెట్టడం ఆశ్చర్యంగా అనిపించింది. అప్లికేషన్ ఇవ్వకుండా సెలవు తీసుకోవడం అతనికి బహుశః మొదటిసారేమో !

నాలుగు రోజు లలాగే గడిచిపోయాయి. అత నిల్లు ఆఫీసుకి దూరమవటంవల్ల అతని నుంచి ఎటువంటి సమాచారమూ లేదు. నాలో ఏదో అనుమానం తలెత్తింది. మన సెందుకో కీడును శంకించింది.

అయిదో రోజు రాఘవరావు మామూలుగా ఆఫీసు కొచ్చి, నా రూంలో అడుగు పెట్టాడు ''గుడ్ మార్నింగ్ సర్'' అంటూ. ఆ వెంటనే తను నిత్యం, ఉదయాన్నే అడిగే ప్రశ్న ''ఎనీ గుడ్ న్యూస్ సర్?'' అడిగాడు.

నే నతన్ని విష్ చేశాను. ఆయన ఈ నాలుగు రోజులూ ఎందుకు రాలేదని కనుక్కుందా మనుకునేంతలో ఎక్కడి నుంచో నాకు ఫోన్ కాల్ రావడం, ఆ మాటల్లో పడి మరిచిపోవడం అయిపోయింది. రాఘవరావు తన సెలవు చీటీ నా టేబిల్ మీద ఉంచేసి తన రూంలోకి వెళ్ళిపోయాడు.

కాసేపటికి అతన్ని పిలుద్దా మనుకున్నంతలో, అతని సెలవు చీటీ చూసి చదివాను. సెలవు చీటీ సారాంశాన్ని అర్థం చేసుకున్న నాకు మతిపోయినట్లయింది. నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. మరోసారి చదివాను.

''నా పెద్ద కొడుకు తీవ్రమైన జ్వరంతో మరణించడంవల్ల గత నాలుగు రోజులు ఆఫీసు పనులకు హాజరు కాలేకపోయాను. దయచేసి ఆ నాలుగు రోజులకు కాజువల్ లీవు గ్రాంటు చేయవలసినదిగా కోరుతున్నాను.''

అతనిలో నాకు మరో వ్యక్తి నిజరూపంగా కనిపించాడు. ఎవరో మహానుభావుడు చెప్పిన సూక్తి గుర్తుకొచ్చింది- ''కష్టాల్ని నీలో ఉంచుకో, శుభాల్ని సుఖాల్ని అందరితో పంచుకో.''

---

ప్రపంచంలో అతి పెద్దదైన క్రాస్ వర్డ్ పజిల్-అమెరికాలోని 'హ్యాంకికోవల్' అనే అతడు సేకరించాడు. ఎడమ నుండి కుడికి [అడ్డంగా] 2631-క్లూలను, పై నుండి క్రిందికి [నిలువు] 2922 క్లూ పదములను ఈ పజిల్‌లో ఉండినాయి. దీని పొడవు-వెడల్పులు [16 1/2 అడుగుల చచ్చేకము.

''వైల్డ్‌వెస్ట్' లోని ప్రభుత్వం రాకముందు ''అమెరికా సంయుక్త సంస్థానపు 19వ శతమానంలో పశ్చిమ ప్రదేశాల్లో ఎన్నోమార్లు జింక చర్మాన్ని [BUCK SKIN] కరెన్సీగా ఉపయోగించేవారట. అందుకనే అమెరికా-దేశీయులు డాలర్‌ను బక్ అని పులుస్తారు.

**చాగాపురం**

---

